

సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 15 । జూన్ । 2024



ఇటు తెలుగు.. అటు ఆంగ్లం!

పాఠ్యాంశాల రూపకల్పనలో మార్పులు చేస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తీర్చిదిద్దుతున్నారు. 8లో



..ప్రమాదాల నివారణే లక్ష్యం

జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని ఎస్ఈ భీకంసింగ్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం ఎండ తీవ్రత ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచ హారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పామాయిల్ రైతు సదస్సు

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ పామాయిల్ రైతుల సంఘం రాష్ట్ర సదస్సును శనివారం అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పామాయిల్ సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడంతోపాటు పామాయిల్ టన్ను మద్దతు ధరపై తీర్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా అలపాటి

దమ్మపేట: తెలంగాణ ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మండలానికి చెందిన అలపాటి రామచంద్రప్రసాద్‌ను నియమిస్తూ, రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ అశోక్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రప్రసాద్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అతికించి మేనేజ్...



కొత్తగూడెంఅర్బన్: పాఠ్యపుస్తకాలలో ముందు మాట కలిగిన మొదటి పేజీలో మాజీ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి పేర్లు ఉండటంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను తిరిగి తీసుకోవాలని, లేకుంటే ఆ పేజీకి స్టిక్కర్లు అంటించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి డీఈఓ వెంకటేశ్వరాచారి ఆదేశాలతో కాంప్లెక్స్ స్థాయిలో 1 నుంచి 10వ తరగతి తెలుగు సబ్జెక్టు పాఠ్యపుస్తకాలను రిటర్న్ తెప్పించుకుని, వాటిలోని మొదటి పేజీని పక్కన ఉన్న పేజీతో అతికించి తిరిగి పాఠశాలలకు అప్పగించారు. కొన్ని పాఠశాలల్లో సమస్యతో కూడిన మొదటి పేజీ చించివేసి, తిరిగి విద్యార్థులకు పుస్తకాలు అప్పగించారు.

సాగు..జాగు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం వ్యవసాయ సీజన్ ఆలస్యమవుతోంది. వర్షాల కోసం రైతన్నలు వేయికళ్లతో ఎదురుచూస్తుండగా, నీటివనరులు ఉన్న ప్రాంతాల్లో మాత్రం వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఖరీఫ్‌లో పంటల సాధారణ విస్తీర్ణం 4,71,622 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. సీజన్‌లో ఇప్పటివరకు 1,69,827 ఎకరాల్లో పంటల సాగు చేపట్టగా, సాగు విస్తీర్ణం 36 శాతంగా నమోదైంది. కాగా శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురియగా రైతన్నలు ఉపశమనం పొందారు.



విత్తనాలు నాటుతున్న కూలీలు

- జిల్లాలో మందకొడిగా పంటల సాగు
- ఈ సీజన్‌లో ఇప్పటివరకు 36 శాతమే..
- వరుణుడి కోసం రైతుల ఎదురుచూపు
- జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు

8 మండలాల్లో లోటు వర్షపాతం

జిల్లాలో 8 మండలాల్లో అధిక, 8 మండలాల్లో లోటు, 3 మండలాల్లో సాధారణ, 4 మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. ఆళ్లపల్లి మండలంలో అత్యధికంగా 109.6 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదుకాగా, లక్ష్మీదేవిపల్లి మండలంలో 6.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 52.8మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. కరకగూడెం, చర్ల, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాలలో అధికవర్షపాతం నమోదైంది. ఈ మండలాల్లో వర్షపాతానికి తోడు నీటివనరులు ఉండటంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నీటి వనరులు కూడా ఉండటంతో ఇక్కడా వ్యవసాయ పనులు చురుగ్గా చేస్తున్నారు. పినపాక, చుంచుపల్లి, పాల్వంచ, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, చంద్రుగొండ, మణుగూరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ మండలాల్లో వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా సాగుతున్నాయి. దుమ్ముగూడెం, అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదుకాగా, వ్యవసాయపనులు నత్తనడకన సాగుతున్నాయి. కాగా జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో ఇప్పటికే నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తే అవకాశంఉంది. ఇలా రెండు, మూడు రోజులు వానలు కురిస్తే విత్తనాలు నాటేందుకు పదును సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం
వరి	1,60,332	46
మొక్కజొన్న	41,503	0
పత్తి	1,56,212	18,426
కందిపప్పు	5,825	0
వేరుశెనగ	1,871	0
మిర్చి	17,339	0
పొద్దుతిరుగుడు	1,273	0
ఆయిల్‌పామ్	37,053	64,436

మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మి.మీ.లలో)

మండలం	సాధారణం	నమోదు
అధిక వర్షపాతం		
కరకగూడెం	45.6	97
చర్ల	47.5	91.2
ఆళ్లపల్లి	55.3	109.6
గుండాల	58.3	100.6
ఇల్లెందు	41.1	80.6
టేకులపల్లి	49.7	97.6
జూలూరుపాడు	52.2	68.8
సుజాతనగర్	52.6	66
సాధారణ..		
అశ్వాపురం	54.8	50
భద్రాచలం	52.2	61.6
బూర్గంపాడు	54.5	63
లోటు..		
పినపాక	47	33.8
చుంచుపల్లి	53.5	40
పాల్వంచ	54.3	41.8
ములకలపల్లి	55.4	23.6
దమ్మపేట	47.2	30.4
అశ్వారావుపేట	44.8	32.4
చంద్రుగొండ	42.4	24.6
మణుగూరు	51.3	38.8
స్వల్ప..		
కొత్తగూడెం	57.3	13.6
లక్ష్మీదేవిపల్లి	51.7	6.8
అన్నపురెడ్డిపల్లి	52	19.4
దుమ్ముగూడెం	57.2	23.2
జిల్లా మొత్తం	1177.9	1214.6
జిల్లా సరాసరి	51.2	52.8

వర్షాలు పడితేనే వ్యవసాయ పనులు



వర్షాల కోసం ఎదురు చూస్తున్నాం. వానలు పడితేనే వ్యవసాయ పనులను ముమ్మరం చేస్తాం. శుక్రవారం కొన్నిచోట్ల వర్షం కురిసింది. ఇలా రెండు, మూడు రోజులు కురిస్తే విత్తనాలు వేసుకుంటాం.

– జి.లింగమూర్తి, రైతు, గరీబ్‌పేట

ఊపందుకుంటున్నాయి..



జిల్లాలో ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. వర్షాలు ఎక్కువగా కురిసిన మండలాల్లో ముమ్మరంగా పనులు సాగుతున్నాయి. రైతులకు పంటల సాగు, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పిస్తున్నాం.

– బి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆశల పల్లకీలో...

త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ!

- కాంగ్రెస్‌లో ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులపై పలువురు నేతల కన్ను
- జిల్లా స్థాయి పదవులపై ఇంకొందరి ఆశలు
- మంత్రులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైన నాయకులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల కోడ్ ముగిశాక నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉంటుందని ముఖ్యమంత్రి గతంలో ప్రకటించగా.. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. దీంతో ఆశావహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. లోక్‌సభ ఎన్నికల ముందు ఉమ్మడి జిల్లా నుంచి పొదెం వీరయ్య, రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, నూతి శ్రీకాంత్, నాయుడు సత్యనారాయణకు నామినేటెడ్ పోస్టులు దక్కాయి. అయితే, వీరు ఇంకా ప్రమాణస్వీకారం చేయకున్నప్పటికీ రెండో దశలో మిగిలిన ఆశావహులు పదవుల కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఐదుగురికి రాష్ట్ర స్థాయి పోస్టులు వచ్చిన నేపథ్యాన ఇంకా ఒకరిద్దరికి అవకాశముంటుందని ఆశిస్తున్నారు.

జాబితా పెద్దదే...

దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులను దక్కించుకోవాలనుకుని ఆశావహులు భారీగానే పోటీ పడుతున్నారు. త్వరలోనే పదవుల భర్తీ జరగనుందనే ఊహాగానాలతో నాయకుల్లో ఉత్సాహం రెట్టింపైంది. రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులకు డిమాండ్ నెలకొంది. అయితే, కొందరు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతుండగా.. ఇంకొందరు మాత్రం నామినేటెడ్ పదవులపైనే కన్నేసినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కష్టపడిన తమకు పదవులు కట్టబెట్టాల్సిందేనని పలువురు నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

పొంగులేటి వర్గంలో పోటాపోటీ

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు చాలామంది నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. వైరా నియోజకవర్గం నుంచి బొర్రా రాజశేఖర్, మధిర నియోజకవర్గంలో డాక్టర్ కోట రాంబాబు, ఐలూరు వెంకటేశ్వరరెడ్డి, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, ఖమ్మం నియోజకవర్గం నుంచి నిరంజన్‌రెడ్డి, పినపాక నియోజకవర్గంలో తుళ్లూరి బ్రహ్మయ్య, బి.విజయ్, కొత్తగూడెం నియోజకవర్గంలో నాగ సీతారాములు, ఎడవల్లి కృష్ణ, తూము చౌదరి, ఇల్లెందులో మేకల మల్లిబాబుయాదవ్, మూల మధుకర్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గంలో కన్నెగంటి శివరామకృష్ణ ఈ జాబితాలో ఉన్నారు.

భట్టి వర్గం నుంచి పలువురు..

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వర్గానికి చెందిన నేతలు పలువురు సైతం పదవుల కోసం ప్రయత్నాలు చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధిర నియోజకవర్గం నుంచి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండదపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, పైడిపల్లి కిషోర్, ఖమ్మం నియోజకవర్గం నుంచి మహమ్మద్ జావేద్, కొత్తగూడెం నుంచి పోట్ల నాగేశ్వరరావు, ఏనుగుల అర్జున్‌రావు, ఇల్లెందు నియోజకవర్గం నుంచి డాక్టర్ జి.రవి పదవులు ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

తుమ్మల, రేణుక వర్గాల్లోనూ అదే జోరు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని నమ్ముకున్న పలువురు నేతలు, కార్యకర్తలు సైతం పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో తుమ్మల వర్గానికి చెందిన కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, పాలేరులో పొంగులేటి, తుమ్మల వర్గానికి చెందిన రామసహాయం వెంకటరెడ్డి, పినపాక నియోజకవర్గం నుంచి బి.విజయ్‌గాంధీ పదవులపై కన్నేశారు.

ఇక వైరాలో రేణుకాచౌదరి వర్గానికి చెందిన కట్ల రంగారావు, సత్తుపల్లి నియోజకవర్గంలో నున్నా రామకృష్ణ, కోటూరి మానవతారాయ్, పాలేరు నియోజకవర్గంలో ధరావత్ రామ్మూర్తినాయక్, ఇల్లెందు నియోజకవర్గంలో ఎంపీ బలరాంనాయక్ వర్గానికి చెందిన చీమల వెంకటేశ్వర్లు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారిలో ఉన్నారు. వీరిలో చాలా మంది రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులను ఆశిస్తుండగా.. ఎందరికీ దక్కుతాయో వేచి చూడాల్సిందే.

పదవి దక్కించుకునేందుకు..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గతంలో ఉన్న కొన్ని కార్పొరేషన్, నామినేటెడ్ పదవులను రద్దు చేసింది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఈ పోస్టులు కట్టబెడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈక్రమాన ఆశావహులు పదవులు దక్కించుకునే పనిలో పడ్డారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులతోపాటు ఎంపీ రేణుకాచౌదరి వర్గానికి చెందిన నేతలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు మొదలు మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థలే కాక ఇంకొన్ని నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

80 శాతం విచారణ పూర్తి

ధరణిపై వీసీలో కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ధరణి పెండింగ్ దరఖాస్తులపై 80 శాతం విచారణ పూర్తయిందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ధరణి పెండింగ్ దరఖాస్తులపై శుక్రవారం సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 3,851 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం పార్లమెంట్, పట్టభద్రుల ఉప ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో దరఖాస్తులు పెండింగ్ పడ్డాయని పేర్కొన్నారు. అయితే దరఖాస్తుల్లో 80 శాతం విచారణ పూర్తయిందని, మిగిలిన 20 శాతం రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. వారంరోజుల్లో పూర్తిస్థాయిలో దరఖాస్తులను పరిష్కరిస్తామని వివరించారు. అనంతరం కలెక్టర్ ఆర్డీఓలు, తహసీల్దార్లతో ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దరఖాస్తులను త్వరితగతిన విచారణ నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం , భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, డీఆర్వో రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఎంఈఓలు కావలెను!

- మండల విద్యాశాఖాధికారి పోస్టులన్నీ ఖాళీ
- జిల్లాలోని 23 మండలాల్లో ఇన్‌చార్జ్ ఎంఈఓలే..
- పది మంది హెచ్‌ఎంలకే అన్నింటి బాధ్యతలు
- పర్యవేక్షణ కొరవడి పడిపోతున్న విద్యా ప్రమాణాలు



మణుగూరులోని మండల విద్యావనరుల కేంద్రం

బూర్గంపాడు: జిల్లాలో ఒక్కరూ రెగ్యులర్ ఎంఈఓ లేరు. ఏళ్ల తరబడి ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి కొనసాగిస్తున్నారు. వారు తాము పనిచేస్తున్న పాఠశాలల కార్యకలాపాలతో పాటు ఇతర మండలాల్లోని పాఠశాలలను పర్యవేక్షించాల్సివస్తోంది. ఒక్కొక్కరికీ మూడు, నాలుగు మండలాల బాధ్యతలను అప్పగించారు. దీంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడి విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాలే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. టెన్త్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 26వ స్థానంతో సరిపెట్టుకుంది.

ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు మండలాలు

జిల్లాలోని 23 మండలాలకు 10 మంది ఇన్‌చార్జ్ ఎంఈఓలు ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికి మూడు, నాలుగు మండలాల చొప్పున బాధ్యతలు అప్పగించారు. వీరిలో మళ్లీ ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న హెచ్‌ఎంలను ఇక్కడ ఇన్‌చార్జిలుగా కొనసాగిస్తున్నారు. దీంతో వారు అటు పాఠశాలలకు వెళ్లలేక, ఇటు మండల విద్యాశాఖ బాధ్యతలు చూడలేక సతమతమవుతున్నారు.

స్కూలు ఈ చివర.. ఇన్‌చార్జి మండలం ఆ చివర

కొత్తగూడెం ఇన్‌చార్జ్ ఎంఈఓకు కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చర్ల..ఐదు మండలాల బాధ్యతలు అప్పగించారు. కొత్తగూడెం నుంచి చర్లకు వెళ్లాలంటే సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. ఐదు మండలాల విద్యాశాఖ బాధ్యతలు చూడలేక నానా అవస్థ పడుతున్నారు. అశ్వారావుపేట ఇన్‌చార్జ్ ఎంఈఓకు ఆళ్లపల్లి, గుండాల మండలాల బాధ్యతలను అప్పగించారు. అశ్వారావుపేట నుంచి ఆళ్లపల్లి, గుండాల వెళ్లాలంటే వంద కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. తాము హెచ్‌ఎంగా పనిచేసే పాఠశాల పర్యవేక్షణతో పాటు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలాల్లోని పాఠశాలల పర్యవేక్షణ ఎంత క్లిష్టతరంగా ఉంటుందో ఆలోచించాలని ఎంఈఓలు పేర్కొంటున్నారు.

బోధనకు సమయమేది?

పాఠశాలల నిర్వహణ తీరు, ఉపాధ్యాయుల సమయపాలన, విద్యాబోధన, వసతుల కల్పన, మధ్యాహ్న భోజన అమలు తదితర విషయాలను మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ముఖ్యంగా విద్యాప్రమాణాలు పెంచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వీరి పర్యవేక్షణ తప్పనిసరి. అయితే ఇన్‌చార్జ్ ఎంఈఓలకు ఈ అదనపు బాధ్యతలు గుదిబండలా మారాయి. తాము పనిచేస్తున్న పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారు. ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా రోజువారీ రిపోర్ట్‌లపై సంతకాలు, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్ల వంటి వాటితోనే సమయం గడిచిపోతోంది. విద్యాబోధన తీరుపై దృష్టి పెట్టేందుకు సమయం ఉండటం లేదు. దీంతో విద్యాశాఖ పనితీరు గాడి తప్పి ఫలితాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇన్‌చార్జ్ ఎంఈఓలకు పనిభారం పెరుగుతుండగా, కొన్ని పనులను కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నిర్వర్తిస్తున్నారు. ఎంఈఓల భర్తీ ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టులో కేసులున్నందున ఇన్‌చార్జ్ ఎంఈఓలతోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆన్‌లైన్ సమావేశాలే..

రెండేళ్లుగా విద్యాశాఖలో మండలస్థాయి హెచ్‌ఎంల సమావేశాలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. ఎంఈఓలకు ఒకటి కంటే ఎక్కువ మండలాల బాధ్యతలు అప్పగించడం, వారు పనిచేస్తున్న పాఠశాలలకు, మండలాలకు అధిక దూరం ఉండటంతో భౌతికంగా సమావేశాలు నిర్వహించే పరిస్థితి లేదు.

ఖమ్మంలో హెచ్‌ఎంలు.. భద్రాద్రిలో ఎంఈఓలు

టేకులపల్లి, జూలూరుపాడు మండలాల ఇన్‌చార్జ్ ఎంఈఓలకు ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు, ముచ్చర్లకు బదిలీ అయింది. అయినా వారిని ఇంకా ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈఓలుగా కొనసాగిస్తున్నారు. మణుగూరు ఇన్‌చార్జ్ ఎంఈఓకు అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల అదనపు బాధ్యతలు చూడాల్సి ఉంది. దుమ్ముగూడెం ఇన్‌చార్జ్ ఎంఈఓకు భద్రాచలం, బూర్గంపాడు మండలాల అదనపు బాధ్యతలున్నాయి. చంద్రుగొండ ఇన్‌చార్జ్ ఎంఈఓకు అన్నపురెడ్డిపల్లి అదనపు బాధ్యతలు చూడాల్సి ఉంది. పాల్వంచ ఇన్‌చార్జ్ ఎంఈఓకు ములకలపల్లి మండలం అదనపు బాధ్యతలున్నాయి. ఇల్లెందు, దమ్మపేట మండలాల ఇన్‌చార్జ్‌లకు మాత్రమే ఒక్కో మండల బాధ్యతలున్నాయి.

పర్యవేక్షణపై దృష్టి సారిస్తాం..



జిల్లాలోని అన్ని పాఠశాలల పర్యవేక్షణపై దృష్టి పెడతాం. జిల్లాలో పదిమంది ఇన్‌చార్జ్ ఎంఈఓలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ ఎంఈఓల భర్తీకి సంబంధించి సుప్రీంకోర్టులో కేసులున్నాయి. ప్రభుత్వ నిర్ణయాల మేరకు జిల్లా విద్యాశాఖ పనిచేస్తోంది.

– వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాశాఖాధికారి

తగ్గిన తునికాకు సేకరణ

- లక్ష్యం 32,300 స్టాండర్డ్ బ్యాగులు..
- సేకరణ 13,478.71 స్టాండర్డ్ బ్యాగులే..
- ప్రభావం చూపిన అకాల వర్షాలు, ఎన్నికలు, ఉపాధి పనులు

పాల్వంచరూరల్: ఈ ఏడాది తునికాకు సేకరణ లక్ష్యం నెరవేరలేదు. గతేడాదికంటే తగ్గిపోయింది. మే నెలతోపాటు జూన్ మొదటివారంవరకు జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులు ఆకు సేకరించారు. తునికాకు సేకరణ ప్రారంభంలోనే అకాల వర్షాలు కురిశాయి. అదే సమయంలో పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. ఎక్కువ మంది ప్రజలు ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లారు. ఈ నేపథ్యంలో తునికాకు సేకరణపై ఆసక్తి తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో గతేడాది లక్ష్యంలో 58.71 శాతం ఆకు సేకరించగా, ఈ ఏడాది మాత్రం 41.7 శాతానికి సేకరణ పరిమితమైంది. దాదాపు 17 శాతం సేకరణ పడిపోయింది. జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో ఈ ఏడాది తునికాకు సేకరణ లక్ష్యం 32,300 స్టాండర్డ్ బ్యాగులుగా నిర్దేశించగా, 13,478.7స్టాండర్డు బ్యాగులు మాత్రమే సేకరించారు. గతేడాది లక్ష్యం 35,100 స్టాండర్డు బ్యాగులు కాగా, 20,608 స్టాండర్డు బ్యాగుల సేకరణ జరిగింది.



తునికాకు సేకరిస్తున్న కార్మికుడు

అటవీశాఖ డివిజన్ల వారీగా పరిశీలిస్తే

కిన్నెరసాని అభయారణ్యం పరిధిలో 3,200 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 1427.59 బ్యాగులు, భద్రాచలం డివిజన్‌లో 9,700 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 3977.04 స్టాండర్డ్ బ్యాగులు, ఇల్లెందు డివిజన్‌లో 10,600 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 4798.55 స్టాండర్డ్ బ్యాగులు, మణుగూరు డివిజన్‌లో 5,400 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 2465.55 స్టాండర్డ్ బ్యాగులు, పాల్వంచ డివిజన్‌లో 2,000 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 463.32 స్టాండర్డ్ బ్యాగులు, కొత్తగూడెం డివిజన్‌లో 1,400 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 346.66 స్టాండర్డ్ బ్యాగులు తునికాకు సేకరించారు.

ఆసక్తి చూపని కూలీలు

తునికాకు సేకరణపై ఈ ఏడాది గిరిజనులు ఆసక్తి చూపలేదు. అకాలవర్షాలకు తోడు, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సేకరణ తగ్గిపోయింది. వర్షాల కారణంగా చీడపీడలు పట్టి ఆకు పనికి రాకుండాపోయింది. దీంతో నాణ్యమైన ఆకు లభించలేదు. ఏటా ఏప్రిల్ నెలాఖరు నుంచి తునికాకు సేకరిస్తారు. కానీ ఈ ఏడాది టెండర్ల ప్రక్రియ జాప్యం కావడంతో తునికాకు సేకరణ వారం పది రోజులు ఆలస్యంగా ప్రారంభమైంది. దీనికితోడు ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్లారు.

ఈసారి తగ్గింది



జిల్లాలోని తునికాకు సేకరణ లక్ష్యం 32,300స్టాండర్డు బ్యాగులుకాగా 13,478.71 స్టాండర్డు బ్యాగుల సేకరణ జరిగింది. అకాల వర్షాలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆకు సేకరణకు గిరిజనులు, గిరిజనేతర కూలీలు ముందుకు రాలేదు. దీంతో లక్ష్యం నెరవేరలేదు. క్రమంగా తునికాకు సేకరించే కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది.

–కృష్ణాగౌడ్, జిల్లా అటవీశాఖాధికారి

క్లుప్తంగా

స్వర్ణకవచ ధారణలో రామయ్య



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారిని శుక్రవారం అర్చకులు స్వర్ణకవచాలతో అలంకరించారు. భక్తులు దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఆలయ అన్నదాన సత్రంలోనికి వర్షపు నీరు చేరడంతో భక్తులకు ప్యాకెట్లుగా భోజనం అందజేస్తామని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

27న వాహనాల వేలం

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 323 వాహనాలకు ఈ నెల 27న వేలంపాట నిర్వహించనున్నట్లు ఎంటీఓ ఓ.సుధాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 306 ద్విచక్రవాహనలు, 17 ఆటోలు, కార్లు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేలంపాట ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు 87126 82145 నంబరులో సంప్రదించాలని కోరారు.

సింగరేణిలో ఈపీ ఆపరేటర్ల శిక్షణకు వాహనాలు కరువు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఈ నెల 18వ తేదీ నుంచి ఈపీ ఆపరేటర్ల ఎంపికకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం తొలుత శిక్షణ ఇప్పించాలని వివిధ సంఘాల బాధ్యులు కోరగా అధికారులు సానుకూలంగా స్పందించారు. అయితే, శిక్షణకు భారీ వాహనం కేటాయించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న 68 డంపర్ ఆపరేటర్ పోస్టులకు ఈ నెల 18 నుంచి 21 వరకు వివిధ ఏరియాల్లో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు షెడ్యూల్ ప్రకటించారు. వంద మార్కులతో నిర్వహించే పరీక్షలో డ్రైవింగ్‌కే 60 మార్కులు కేటాయించారు. ఈ నేపథ్యాన కీలకమైన డ్రైవింగ్ శిక్షణ ఇప్పించేందుకు సుముఖంగా ఉన్నా వాహనం కేటాయింపులో మాత్రం అధికారులు కొర్రీలు పెడుతున్నారని తెలుస్తోంది. సింగరేణి వ్యాప్తంగా రోజుకు సుమారు 60 నుంచి 80 వేల టన్నుల బొగ్గును లారీల ద్వారా రవాణా చేస్తుండగా, ఏదైనా ఒక రవాణా సంస్థను సంప్రదిస్తే భారీ వాహనం కేటాయించే అవకాశముంది. అయినప్పటికీ అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. డ్రైవింగ్ పరీక్షకు సమయం సమీపిస్తున్నా అధికారులు స్పందించక పోవడం సరి కాదని, ఇకనైనా శిక్షణకు వాహనాలు సమకూర్చాలని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు.

భద్రాచలం రెడ్‌క్రాస్‌కు మూడు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకుటున్న సభ్యులు

భద్రాచలంఅర్బన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా భద్రాచలంకు చెందిన రెడ్‌క్రాస్ సంస్థకు మూడు ప్రశంసాపత్రాలు దక్కాయి. ఏడాదికాలంగా సంస్థ ఆధ్వర్యాన కార్యక్రమాలకు గాను శుక్రవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి అజయ్‌మిశ్రా వీటిని అందించారు. ఏడాది కాలంగా జిల్లాలో 17 బ్లడ్ క్యాంపులు నిర్వహించడంతో సంస్థకు, 24 సార్లు రక్తదానం చేసిన చేయూత స్వచ్ఛంద సేవా సమితి నిర్వాహకుడు చిడెం సాయి ప్రకాష్‌కే భద్రాచలంలోని రెడ్‌క్రాస్‌లో 2,547 మంది రక్తదానం చేయించడంపై ప్రశంసపత్రాలు అందజేసి బాధ్యులను అభినందించారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు, కార్యదర్శి డాక్టర్ భాను ప్రసాద్‌తో పాటు రాజారెడ్డి, సూర్యనారాయణరావు, కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భద్రాచలంఅర్బన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి శుక్రవారం పట్టణంలోని కూనవరం రోడ్డులో పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ డ్రైవర్ పుణెం మూర్తితో పాటు యజమాని నానుపల్లి నరేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

ఇటు ఆంగ్లం.. అటు తెలుగు!

ఎస్సెస్సీ విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలు

- తెలుగు నుంచి ఇంగ్లిష్ మీడియంలోకి వచ్చిన విద్యార్థులకు ఉపయోగం
- ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలు

కొణిజర్ల: పాఠ్యాంశాల రూపకల్పనలో ఏటేటా మార్పులు చేస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ సంస్కరణలు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా గత ఏడాది 8, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో ముద్రించిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయగా ఈసారి పదో తరగతి విద్యార్థులకు సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టినప్పటికీ అంతకు ముందు విద్యార్థులంతా తెలుగు మీడియంలో చదివి ఉండటంతో ఒకేసారి ఇంగ్లిష్‌లో పాఠాలను అర్థం చేసుకోలేకపోతున్నారని అధికారులు గుర్తించారు. దీన్ని అధిగమించడానికి ప్రభుత్వం ప్రతీ పాఠాన్ని తెలుగు, ఆంగ్లంలో ముద్రించి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇలా గణితం, ఫిజిక్స్, బయాలజీ, సాంఘిక శాస్త్రం పుస్తకాలను రెండేసి భాషల్లో ముద్రించి అందిస్తోంది.

రెండు భాగాలుగా..

పుస్తకాల్లో ప్రతీ పాఠాన్ని రెండేసి భాషల్లో ముద్రించారు. ఈ నేపథ్యాన గణితం, సాంఘికశాస్త్రం, సైన్స్ పుస్తకాలు మొత్తం చాప్టర్లను ఇలా ముద్రిస్తే పేజీల సంఖ్య పెరుగుతుందనే భావనతో రెండు భాగాలుగా ముద్రించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు ఎస్‌ఏ–1 పరీక్షల కోసం పార్ట్–1, నవంబర్ నుంచి మార్చి వరకు పార్ట్–2 పుస్తకం బోధించేలా విభజించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన ఈ నెల 12నే ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ పుస్తకాల పంపిణీ ప్రారంభించారు. తద్వారా తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో సులువుగా రాణిస్తారని భావిస్తున్నారు. ఇక ఈ ఏడాది పంపిణీ చేస్తున్న పుస్తకాలను అందమైన కవర్ పేజీలతో తీర్చిదిద్దడమే కాక ప్రతీ పాఠంలో రంగురంగుల బొమ్మలు, పాఠానికి సంబంధించిన వీడియోల కోసం పక్కనే క్యూ ఆర్ కోడ్ సైతం ముద్రించారు. ఈ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే సంబంధిత వీడియో పాఠం వస్తుంది. ఈ విధానం కూడా విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా..



పాఠ్యపుస్తకాలు రెండు భాషల్లో ఉండటం ఉపయోగకరం. ఇంగ్లిష్ మీడియంలో వెనుకబడిన విద్యార్థులు పాఠాన్ని అవగాహన చేసుకోవడానికి తెలుగు మీడియంలో ముద్రించిన పాఠాలు ఉపయోగపడతాయి. తద్వారా మిగతా విద్యార్థులతో సమానంగా రాణించడం సాధ్యమవుతుంది.

–తాతా రామారావు, గణిత అధ్యాపకుడు



తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ముద్రించిన గణిత పుస్తకం

పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం..



అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ మొదలైంది. వంద శాతం మందికి నెలాఖరుకు లోగా పుస్తకాలు అందుతాయి. విద్యా సంవత్సరం తొలిరోజే పాఠ్యపుస్తకాలు ఇచ్చాం. ఈ ఏడాది హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా నోట్ పుస్తకాలు కూడా సరఫరా చేసింది.

–ఎం.శ్యాంసన్, ఎంఈఓ కొణిజర్ల

కూలీల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

ఇద్దరు మృతి.. 15 మందికి గాయాలు



వెంకటలక్ష్మి(ఫైల్)



దుర్గయ్య (ఫైల్)



ఘటనా స్థలంలో తిరగబడిన ట్రాక్టర్



క్షతగాత్రులతో నిండిన ఆస్పత్రి

అశ్వారావుపేట: మామిడి మొక్కలను రవాణా చేసేందుకు వచ్చిన కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం అశ్వారావుపేట కోకోనట్ సీడ్ గార్డెన్, విజయదుర్గ అమ్మవారి ఆలయం మధ్య ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు నర్సరీ వ్యాపారులు మొక్కలను ఒకరి నుంచి ఒకరు ఒక నెల రోజుల నుంచి రవాణా చేసుకుంటున్నారు. ఇందుకు గాను అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన యాభై మంది వరకు ముఠాగా ఏర్పడి మొక్కల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసి పొట్టపోసుకుంటున్నారు. ఈ క్రమంలో నారంవారిగూడెం గ్రామానికి చెందిన ఓ నర్సరీ వ్యాపారి కొనుగోలు చేసిన మొక్కలను అశ్వారావుపేట వైపు నుంచి నారంవారిగూడెంనకు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. మొక్కలతోపాటు ముఠా కూలీలను కూడా అదే ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. సాయంత్రం సుమారు 4.50 గంటల సమయంలో ట్రాక్టర్ కోకోనట్‌సీడ్ గార్డెన్ దాటి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. కూలీలంతా రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయారు. వెనుక వరుసలో నిలుచుని ఉన్న వంటెపులి వెంకటలక్ష్మి(30) లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. మరో 18 మందికి తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని ట్రాక్టర్ ద్వారా అశ్వారావుపేట సీహెచ్‌సీకి తరలించారు. అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించి మృతదేహాన్ని మార్చురీకి చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బత్తుల దుర్గయ్య (65) మృతిచెందాడు. దేరంగుల అనిల్, కోటమ్మ, నాగమణి, మము ఎసలయ్య, దుర్గమ్మ, దేరంగుల స్వాతి, అలివేలు, సామ్రాజ్యం, నీరజ, నాగమల్లేశ్వరి, డి.వెంకమ్మ, దుర్గయ్య, కృష్ణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారందరినీ సత్తుపల్లి, ఖమ్మం, కొత్తగూడెం ఆస్పత్రులకు తరలించారు.

కూలి కోసం వచ్చి..

ఘటనా స్థలంలో ప్రాణాలు విడిచిన వంటెపులి వెంకటలక్ష్మి కూలి పనులకు వెళ్లేది కాదు. ఇంటిలో ఆర్థి క పరిస్థితులు బాగోలేక.. శుక్రవారమే పనికి వచ్చింది. ఆమె పేదరికం ఆమె బిడ్డల పాలిట శాపమైంది. కుమారుడు, కుమార్తె తల్లిలేని వారయ్యారు. లారీ వేగంగా మీదకు దూసుకు వస్తోందని వెంకటలక్ష్మి కేకలు వేస్తున్నా.. ట్రాక్టర్ డ్రైవర్‌కు వినిపించలేదో.. వినిపించుకోలేదో.. ఆమె మొర ఎదురుగా ఉన్న అమ్మవారు సైతం ఆలకించేలేదో మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినా.. ఇక్కడున్న అరకొర సౌకర్యాలు.. ఒకే ఒక డాక్టర్ సేవలు మరో ప్రాణాన్ని కాపాడలేకపోయాయి.

నా కుటుంబానికి న్యాయం చేయండి..

పిల్లలతో సహా ఓ మహిళ వేడుకోలు..



మాట్లాడుతున్న భవాని, పక్కన ఆమె పిల్లలు

భద్రాచలంఅర్బన్: నెలనెలా పోషణ ఖర్చులు ఇవ్వకుండా తన భర్త వేధిస్తున్నాడని భద్రాచలానికి చెందిన ఇల్లంగి భవాని ఆరోపించింది. పట్టణంలో శుక్రవారం ఆమె తన పిల్లలు అభిలాష్, సంయుక్తతో కలిసి మాట్లాడింది. బీఎస్‌ఎన్‌ఎల్‌లో సబ్ డివిజనల్ ఇంజనీర్‌గా విజయవాడలో పనిచేస్తున్న చిట్టిబాబుతో 2002లో వివాహం జరగగా, వైవాహిక జీవితంలో మనస్పర్థలతో 2009లో తాను కేసు పెట్టానని వెల్లడించింది. ఈమేరకు తనతో పాటు పిల్లల పోషణ కోసం నెలనెలా రూ.30 వేలు ఇవ్వాలని కోర్టు తీర్పు చెప్పగా, కొన్నాళ్లు బాగానే ఇచ్చినా ఆతర్వాత నెలకు రూ.20 వేలు మాత్రమే ఇస్తున్నాడని ఆరోపించింది. అంతేకాక మరో మహిళను వివాహం చేసుకోగా పోలీసులకు మళ్లీ ఫిర్యాదు చేశానని తెలిపింది. ఈమేరకు తన భర్త తనకే దక్కేలా చూడడంతో పాటు అప్పటివరకు పోషణ నిమిత్తం ఖర్చులు ఇప్పించాలని భవానీ విజ్ఞప్తి చేశారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని రాఘబోయినగూడెం గ్రామ పంచాయతీ కొత్తగుంపు గ్రామానికి చెందిన ఈసాల ఎర్రయ్య ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. ఎర్రయ్య కుటుంబ సభ్యులతో సహా ఉదయమే పొలం పనులకు వెళ్లాడు. వ్యవసాయ పనుల నిమిత్తం బ్యాంకు నుంచి తెచ్చుకున్న నగదు రూ.1.30 లక్షలు ఇంట్లో భద్రపర్చుకున్నాడు. కాగా, ఇంటికి వేసిన తాళాన్ని గుర్తుతెలియని దుండగుడు పగలగొట్టి ఇంట్లో ఉన్న రూ.1.30 లక్షలు అపహరించాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న ఎర్రయ్య తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి బీరువాలోని నగదు కోసం వెతికాడు. కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని, పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌లో ఎలక్ట్రికల్ వైరు...

పాల్వంచ: నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ఎలక్ట్రికల్ వైరును గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని టీచర్స్‌కాలనీలో కేకే అపార్ట్‌మెంట్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రూ.80 వేల విలువ చేసే ఎలక్ట్రికల్ వైరును కట్ చేసి అపహరించారని అపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ చల్లా లక్ష్మీనారాయణ తెలిపారు.

19, 20వ తేదీల్లో ఐజేయూ మహాసభలు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, పక్కన ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, నాయకులు

రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, విరాహత్ అలీ

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం కేంద్రంగా ఈనెల 19, 20వ తేదీల్లో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, విరాహత్ అలీ తెలిపారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోరాటాల గడ్డ అయిన ఖమ్మంలో ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యాన రెండు సార్లు, ఇప్పుడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మూడో సారి రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఖమ్మంలోని ఉష కన్వెన్షన్ హాల్(కామ్రేడ్ అమర్‌నాథ్ ప్రాంగణం)లో జరిగే మహాసభల్లో గ్రామీణ విలేకరులకు కనీస హానరోరియం, వేజ్‌బోర్డు అమలు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి 12 తీర్మానాలను ఆమోదించనున్నట్లు తెలిపారు. తొలిరోజు సభలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనుండగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. ముగింపు సభకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరవుతారని తెలిపారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ మాట్లాడుతూ ఖమ్మంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య ఓ కొలిక్కి వచ్చిందని పేర్కొన్నారు. ఈసందర్భంగా మహాసభల లోగోను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు అమరవాది రవీంద్రశేషు, మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, నర్వనేని వెంకటరావు, ఖదీర్, ఆవుల శ్రీనివాసరావు, కనకం సైదులు, నలజాల వెంకటరావు, మైస పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, మొహినుద్దీన్, పురుషోత్తం, శివానంద, జనార్ధనాచారి, ఏలూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

మణుగూరుటౌన్: ఆరు బయట ఆడుకుంటున్న బాలికపై మద్యం మత్తులో లైంగికదాడి చేసిన నిందితుడిని అరెస్ట్ చేసిన ఘటన మణుగూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వాగు మల్లారం గ్రామానికి చెందిన బాలిక (9) ఈ నెల 12వ తేదీన సాయంత్రం సమయంలో ఆరు బయట ఆడుకుంటుండగా, జానంపేట ప్రభుత్వ పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న గాడిద శ్రీనివాస్ దగ్గరలో ఉన్న మద్యం దుకాణంలో మద్యం సేవించి అటుగా వెళ్తూ.. బాలిక నోరు మూసి భవనం పైకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక పెద్ద పెట్టున కేకలు వేయగా, సోదరుడు, తల్లిదండ్రులు భవనంపైకి వేగంగా రావడంతో నిందితుడు మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు శుక్రవారం వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం..

విద్యుత్ ఎస్‌ఈ భీకంసింగ్



సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని విద్యుత్ ఎస్‌ఈ బి.భీకంసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా నిర్లక్ష్యం, అవగాహన లోపం, వినియోగదారుల గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం, రైతులు స్విచ్‌బోర్డు, మోటారు స్టార్టర్ల వద్ద ఎర్తింగ్ వంటి భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. టీజీ ఎస్పీడీసీఎల్ ఉద్యోగులకు తగు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, సిబ్బందికి అన్ని రకాల భద్రతా పరికరాలైన హెల్మెట్, గ్లోవ్స్, పోర్టబుల్ ఎర్తింగ్ షార్ట్, సర్క్యూట్ కిట్లు, సేఫ్టీ షూస్, ఇన్సులేటెడ్ టూల్స్, ఓల్టేజీ డిటెక్టర్ అందజేస్తున్నామని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులంతా ఈ నియమాలను పాటించాలని వివరించారు.

- సెక్షన్ ఇన్‌చార్జ్ ప్రతిరోజూ 15 నిమిషాలు పనికి ముందు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలి.
- విధుల్లో ఉన్న ఎస్‌ఎల్‌ఐ/ఎల్‌ఐ బ్రేక్‌డౌన్ వర్క్ లొకేషన్ వద్ద ఉండాలి. లైన్ డిశ్చార్జ్ చేశాక సురక్షితంగా పని నిర్వహించేలా చూసుకోవాలి.
- అనుమతి కలిగిన అధికారి తగిన జాగ్రత్తతో మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలి. ఫోన్ ద్వారా లైన్ క్లియర్ ఇవ్వడాన్ని నివారించాలి.
- ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచాలి. తప్పనిసరిగా వాటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.
- హెచ్‌టీ/ఎల్‌టీ లైన్ల పనిని ప్రారంభించే ముందు చేతి తొడుగులు, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్‌ను తాకడం ద్వారా లైన్‌డెడ్‌గా ఉందని నిర్ధారించుకోవాలి. లైన్‌కు రెండువైపులా సరైన ఎర్తింగ్ కోసం అన్ని దశల్లో ఎర్త్ డిశ్చార్జ్ రాడ్‌ను ఉపయోగించాలి.
- 33 కేవీ, 11 కేవీ లైన్, సింగిల్‌లైన్ నమూనా రేఖా చిత్రాన్ని ప్రతి సెక్షన్ ఆఫీసు వద్ద ఏబీ స్విచ్, డబుల్ పాయింట్ ఆఫ్ సప్లై, హెచ్‌టీ లైన్ క్రాసింగ్ లొకేషన్ సూచిస్తూ ప్రదర్శించాలి. సిబ్బంది ప్రతి ఒక్కరికీ ఒక్కొక్క కాపీని అంబాటులో ఉంచాలి.
- బ్రేకర్లు, రిలేల సరైన పనితీరును నిర్ధారించడం, విశ్వసనీయ రక్షణ కోసం ఫీడర్, ఎల్‌వీ బ్రేకర్స్ రిలేలో తగిన ఈ/ఎల్, ఓ/ఎల్ సెట్టింగులను మార్చాలి.
- సెక్షన్ ఆఫీసర్, సబ్ డివిజన్ ఆఫీసర్ వద్ద బ్రేక్‌డౌన్ సమాచారం, నిర్వహణ పనులు చేసిన ఫీల్డ్ సిబ్బంది పేర్లు ఉండాలి.
- మెయింటెనెన్స్, అవుట్ వర్క్ జరుగుతున్న ప్రాంతాల్లో సెక్షన్ ఆఫీసర్, ఏడీఈలు ఓఅండ్‌ఎం సిబ్బంది భద్రతా నిబంధనలకు లోబడి పనిచేస్తున్నారో లేదోనని ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. భద్రత ప్రక్రియలో ఏదైనా ఉల్లంఘన ఉన్నట్లు గమనిస్తే చర్యలు తీసుకోవాలి.
- డివిజనల్ ఇంజనీర్/టెక్నికల్/సర్కిల్ ఆఫీస్ నోడల్ సేఫ్టీ ఆఫీసర్ ఓఅండ్‌ఎం సిబ్బంది భద్రతా నిబంధనలకు లోబడి పనిచేస్తున్నారో లేదో ఆకస్మిక తనిఖీలు చేయాలి.
- విద్యుత్ ప్రమాదాల నివారణకు మున్సిపాలిటీ కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బహిరంగ ప్రదేశాలు, సినిమా థియేటర్లు, క్రాస్‌రోడ్ జంక్షన్లు, పాఠశాలలు, కళాశాలలు తదితర ప్రదేశాల్లో భద్రతా అవగాహన సదస్సులు, నివారణ సూచనలు, జాగ్రత్తలు తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేయాలి.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని గోదావరి శివారు ప్రాంతాల మీదుగా కబేళాకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పశువులను శుక్రవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. చర్ల నుంచి గోదావరి మీదుగా హైదరాబాద్ తరలించేందుకు పశువులను తెచ్చి రాజుపేట శివారులో ఉంచారన్న సమాచారంతో ఎస్‌ఐ రాజేశ్ తనిఖీ చేశారు. 23 పశువులను హైదరాబాద్ తరలించేందుకు సిద్ధంగా ఉంచగా, స్వాధీనం చేసుకుని పాల్వంచ గోశాలకు తరలించారు. నిందితుడు హైమద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అది కుళ్లిన మాంసమేనట?

- గత నెల 26న ఖమ్మంలో తనిఖీలు, శాంపిళ్ల సేకరణ
- తాజాగా అందిన పరీక్షల నివేదిక

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలోని పలువురు హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు రోజుల తరబడి నిల్వ చేసిన, కుళ్లిన మాంసం, బూజు పట్టిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యాన ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా, గత నెల 26న ఖమ్మం కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో చికెన్ వింగ్స్ శాంపిళ్లు సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. అయితే, ఆ మాంసం కుళ్లిపోయినట్లుగా నివేదిక జిల్లా అధికారులకు అందినట్లు తెలిసింది. సంబంధిత హోటల్ యాజమాన్యం, మేనేజర్, సిబ్బంది వివరాలతో కూడిన నివేదికను పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమచారం.

శాంపిళ్ల సేకరణ.. పరీక్షలు

ఉమ్మడి జిల్లాలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీల సమయాన పలు హోటళ్ల నుంచి ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. అక్కడ పరీక్షల సందర్భంగా ఖమ్మం కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్‌లో సేకరించిన చికెన్ వింగ్స్ కుళ్లిపోయినట్లు తేలగా.. మిగతా హోటళ్లలో సేకరించిన శాంపిళ్ల నివేదిక అందాల్సి ఉందని తెలుస్తోంది. కాగా, నివేధిక ఆధారంగా జిల్లా అధికారులు సదరు హోటల్ యజమాన్యానికి నోటీసులు జారీ చేసి 30 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించనున్నట్లు సమాచారం. అనంతరం వారు ఇచ్చే సమాధానం ఆధారంగా కేసు నమోదు చేస్తారని.. ఈ గడువులోగా సంబంధిత హోటల్ యాజమాన్యం శాంపిళ్లను ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్ష చేయించేందుకు అవకాశం ఇస్తారని తెలిసింది.

మతిస్థిమితం లేని మహిళ మృతి



మహిళ మృతదేహం

తల్లాడ: తల్లాడ బస్టాండ్‌లో శుక్రవారం తెల్లవారుజామున మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. బస్టాండ్ పరిసరాల్లో కొన్నాళ్లుగా ఉంటున్న ఆమె మృతి చెందినట్లు తెలియడంతో ఎస్‌ఐ కొండల్‌రావు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకీ తరలించారు. కాగా, ఇటీవల కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకున్నట్లుగా ఓపీ చీటీ లభించగా పేరు లక్ష్మి అని ఉందని.. ఆమె ఈచూకీ తెలిసిన వివరాలు సంప్రదించాలని ఎస్సై సూచించారు.

గంజాయి స్వాధీనం

ములకలపల్లి: అక్రమంగా తరలిస్తున్న ఐదు కిలోల గంజాయిని ములకలపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజమౌళి కథనం మేరకు.. ములకలపల్లి శివారులో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఆటోలో అనుమానాస్పదంగా కనిపించిన యువకుడు, బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.లక్ష విలువ గల 5 కిలోల 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం పంచాయతీ పరిధి పత్తిపాక గ్రామానికి చెందిన ఊయిక బాలయ్య ఇల్లు అగ్ని ప్రమాదంలో శుక్రవారం దగ్ధమైంది. గ్రామంలో ఓ కార్యక్రమానికి సంబంధించి వంటలు చేస్తుండగా గాలి రావడంతో నిప్పురవ్వలు ఎగిరి బాలయ్య ఇంటిపై పడ్డాయి. మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటీ సాధ్యపడలేదు. ఇంట్లోని వస్తువులు, రూ.30 వేల నగదు, బంగారం, పట్టీలు, పట్టాదార్ పుస్తకాలు, ఆధార్ కార్డులు పూర్తిగా కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి



మృతిచెందిన ఆవు

పాల్వంచరూరల్: పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి చెందిన ఘటన మండలంలోని భోజ్యాతండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నాగారం జీపీ భోజ్యాతండాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ధర్మసోత్ బాలకృష్ణకు చెందిన ఆవు, ధర్మసోత్ రాంబాబుకు చెందిన దూడ చెట్టు సమీపంలో మేతమేస్తున్న క్రమంలో పిడుగుపడి మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని తెలిపారు.